సాక్షి అన్నమయ్య జిల్లా

శనివారం । 11 । ఫిబ్రవరి । 2023



త్వరలో హార్సిలీహిల్స్‌పై టూరిస్ట్ పోలీసు ప్రారంభం

హార్సిలీహిల్స్‌పై టూరిస్ట్ పోలీస్‌ను సీఎం వైఎస్ జగన్ వర్చువల్ పద్ధతిలో త్వరలో ప్రారంభిస్తారని జిల్లా ఎస్పీ తెలిపారు. -8లో



మరో ఇద్దరు అంతర్‌రాష్ట్ర సైబర్ నేరగాళ్ల అరెస్ట్

మరో ఇద్దరు అంతర్‌రాష్ట్ర సైబర్ నేరగాళ్లను వైఎస్సార్ జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.180	రూ.240
రెండోరకం	రూ.100	రూ.178



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 138 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	672	719
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 595.18 కిలోలు

న్యూస్‌రీల్

క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



విద్యార్థినితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ

రామాపురం: విద్యార్థినులు క్రమశిక్షణతో చదివి, ఉన్నత శిఖరాలు అధిరోహించాలని జిల్లా డీఎంహెచ్‌ఓ కొండయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని కస్తూర్బా పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతిఒక్కరూ ఏకాగ్రతతో చదివి మంచి మార్కులు సాధించాలని చెప్పారు. పరిశుభ్రత పాటించాలని సూచించారు. మండల విద్యాశాఖాధికారి రామకృష్ణుడు వైద్యాధికారి విజయ్‌కుమార్ మాట్లాడారు. సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ పుష్పలత, సీహెచ్‌ఏ ఏలేజర్ తదితరులు పాల్గొన్నారు.

ఈ క్రాప్ నమోదు తప్పనిసరి



మాట్లాడుతున్న ఏడిఏ ఉమామహేశ్వరి

సంబేపల్లె: రైతులు ఈ క్రాప్ తప్పనిసరిగా చేయించుకోవాలని జిల్లా వ్యవసాయశాఖాధికారి ఉమమహేశ్వరి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో జరిగిన మండల వ్యవసాయ మండలి కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రబీ సీజన్‌లో సాగు చేసిన ప్రతి పంటను ఈ క్రాప్ చేయించుకోవాలని చెప్పారు. దీనివల్ల రైతులకు క్రాప్ ఇన్స్యూరెన్స్, రైతు భరోసా అందుతాయన్నారు. పీఎం కిసాన్‌కు ఆధార్,బ్యాంక్ ఖతాను అనుసంధానం చేసుకోవాలన్నారు.కార్యక్రమంలో ఏఓ రామంజులరెడ్డి, మండల వ్యవసాయమండలి చైర్మన్ వాసుదేవరెడ్డి, తదిరతులు పాల్గొన్నారు.

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి



హెచ్‌ఎంతో మాట్లాడుతున్న డీఈఓ రాఘవరెడ్డి

నిమ్మనపల్లె : పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషిచేయాలని డీఈఓ రాఘవరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక జెడ్పీహైస్కూల్(తెలుగు)ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మదనపల్లె డీవైఈఓ కృష్ణప్పతో కలిసి పాఠశాల రికార్డులు, తరగతి గదులు, నాడు-నేడు పథకంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. బోధనా అంశాలపై విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. పాఠశాలల సాధారణ తనిఖీల్లో భాగంగా వచ్చామన్నారు. పదోతరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. మెరుగైన ఫలితాలు సాధించేలా పూర్తిస్థాయి పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. నాడు-నేడు పనులు వీలైనంత త్వరగా పూర్తిచేసి తరగతి గదులను అందుబాటులోకి తెస్తామన్నారు. ఎంఈఓ రాజగోపాల్, హెచ్‌ఎం శ్రీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చదువులకు చెరవాణి

- మదనపల్లె పట్టణం నక్కలదిన్నెకు చెందిన ఓ విద్యార్థిని ఇంటర్‌మీడియట్ చదువుతోంది.సెల్‌ఫోన్ వాడకం తగ్గించుకోవాలని తల్లిదండ్రులు మందలించారు. ఆత్మహత్యయత్నకు యత్నించింది.
- బి.కొత్తకోట మండలం బూర్లపల్లెకు చెందిన ఓ విద్యార్థిని సెల్‌ఫోన్‌లో ఎక్కువ సమయం గడపటంపై విద్యార్థిని తల్లిదండ్రులు మందలించారు. దీంతో విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది.

వీరిద్దరే కాదు. జిల్లాలో ఇటీవల విద్యార్థులు సెల్‌ఫోన్లకు బానిసలు అవుతున్నారు. దీని వల్ల పలు అనర్థాలకు దారి తీస్తున్నాయి.



పదోతరగతి విద్యార్థులు

- అవసరానికి మించి వాడితే అనర్థమే
- పరీక్షల సమయంలో టీవీలు, సెల్‌ఫోన్లకు దూరం ఉంటే మంచిది

మదనపల్లె సిటీ: ఏడాదంతా చదివినవాటికి పబ్లిక్ పరీక్షలే ప్రగతికి కొలమానం...అలాగే భవిష్యత్తుకు మార్గదర్శకం. ప్రధాన పరీక్షలు రాసే విద్యార్థికి ప్రతి మార్కు ఎంతో కీలకం. దీని కోసం అహర్నిశలు శ్రమిస్తేనే విజయం సాధించగలరు. పదో తరగతి ఏప్రిల్ 3 నుంచి, ఇంటర్ పరీక్షలు మార్చి 15 నుంచి జరగనున్నాయి. ఉత్తమ ఫలితాలు సాధించేందుకు విద్యార్థులు పట్టుదల, కృషితో కష్టపడుతున్నారు. పక్కా ప్రణాళికతో ఉపాధ్యాయుల పర్యవేక్షణలో సందేహాలను నివృత్తి చేసుకుంటూ చదువుతున్నారు. ఇక పరీక్షల సమ యం



సమీపిస్తున్నందున విద్యార్థులు కేవలం చదువుపై మాత్రమే దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా సెల్‌ఫోన్‌లు, టీవీలకు ఎంత దూరంగా ఉంటే అంత మంచిదని విద్యావేత్తలు పేర్కొంటున్నారు.

ప్రతి నిమిషం అమూల్యం

పరీక్షల సమయం దగ్గర పడుతుండటంతో విద్యార్థులకు ప్రతి నిమిషం అమూల్యమే. నేటి ఆధునిక సమాజంలో సెల్‌ఫోన్‌లో ఇంటర్‌నెట్ కొందరి పాలిట ప్రమాదాన్ని తెచ్చిపెడుతోంది. కొత్త సాంకేతిక పరిజ్ఞానం ఏదైనా సద్వినియోగం చేసుకున్నంతవరకు అద్భుత ఫలితాలు దక్కుతాయి. దాని నీడనే దుష్ప్రభావాలు ఉంటాయి. సెల్‌ఫోన్‌ని అవసరానికి మించి వినియోగించడం, దీని కోసం ఎక్కువ సమయం వెచ్చిస్తుండటంతో చిక్కులొస్తాయి. ప్రస్తుతం విద్యార్థులకు పరీక్షల కాలం. కీలకమైన సమయంలో సెల్‌ఫోన్ వినియోగం విద్యార్థుల సమయాన్ని హరిస్తోందని విద్యావేత్తలు చెబుతున్నారు. సెల్‌ఫోన్ అలవాటు వ్యసనంగా మారిన బాధిత విద్యార్థుల జీవితాల నుంచి ప్రతి ఒక్కరూ గుణపాఠం నేర్చుకోవాలని సూచిస్తున్నారు. తల్లిదండ్రులు కూడా పరీక్షల సమయంలో సెల్‌ఫోన్లు, టీవీలకు విద్యార్థులకు దూరంగా ఉంచడం ఎంతో ఉత్తమమని వారు పేర్కొంటున్నారు.

ఏకాగ్రతకు దూరం కాకూడదు



సెల్‌ఫోన్లో ఎక్కువ సమయం చాటింగ్, పనిలేకున్నా అవతలివారితో మాట్లాడటం వల్ల చదువుపై క్రమంగా ఏకాగ్రత తగ్గిపోతుంది. పరీక్షల సమయంలో సెల్‌ఫోన్, టీవీలకు విద్యార్థులు దూరంగా ఉండటం మంచిది.

–బాలకృష్ణమూర్తి, ప్రిన్సిపాల్, బాలికల జూనియర్ కాలేజీ, మదనపల్లె

కాలక్షేపానికి వినియోగించవద్దు



విద్యార్థులు కాలక్షేపానికి ప్రారంభించే సెల్‌ఫోన్ అతి వినియోగం భవిష్యత్తులో ప్రమాదాలను తెచ్చిపెడుతుంది. వాటికి దూరంగా ఉండటం చాలా ఉత్తమం. సెల్‌ఫోన్ ఇంటర్‌నెట్ వినియోగం అవసరమున్నా పరీక్షలు ముగిసేవరకు వీలైనంత తగ్గించుకోవాలి.

–డాక్టర్ ఎం.ఎస్.పావని, మెడికల్ ఆఫీసర్, సీహెచ్‌సీ, తంబళ్లపల్లె

ఉచ్చులో ఇరుక్కుపోతున్నారు



మొబైల్ వాడటం వ్యసనంగా మారింది. దీని ఉచ్చులో ఇరుక్కుపోయి చాలా మందికి చదువు మీద దృష్టి పోతోంది. టెక్స్‌మెసేజ్‌లు ఎక్కువ చూస్తుండటం వల్ల నిద్రలేమి, మానసిక ఒత్తిడి గురవుతారు. వీలైనంత తక్కువ సేపు వాడటం మంచిది.

–చాముండేశ్వరి, సైకాలజిస్టు, మదనపల్లె

వీరభద్రుడి బ్రహ్మోత్సవాల పోస్టర్ విడుదల

రాయచోటిటౌన్ : రాయచోటి శ్రీ భద్రకాళీ సమేతుడి శ్రీ వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాల నిర్వహణతో స్వామి వారి ఖ్యాతిని పెంపొందింపజేయాలని రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో బ్రహ్మోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ నుంచి 25 వరకు నిర్వహించే స్వామి వారి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని సూచించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు పోలంరెడ్డి విజయ, ఈవో డీవీ రమణారెడ్డి, కమిటీ సభ్యులు సురేష్, రత్నశేఖర్ రెడ్డి, నాగభూషణం, సర్పంచ్‌లు రామాంజులు, నాగార్జున ఆచారి,నాయకులు చలమారెడ్డి, రఘు తదితరులు పాల్గొన్నారు.

అన్ని ఏర్పాట్లు చేయాలి:కలెక్టర్

శ్రీ వీరభద్రస్వామి వారి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ గిరీషా పీఎస్, జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆలయకమిటీ సభ్యులకు సూచించారు. శుక్రవారం ఆలయ కమిటీ అధ్యక్షుడు పోలంరెడ్డి విజయ, ఈవో డీవీ రమణారెడ్డి, పాలక మండలి సభ్యులతో కలసి బ్రహ్మోత్సవాల పోస్టర్లను వారు ఆవిష్కరించారు.



పోస్టర్ విడుదల చేస్తున్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి తదితరులు

రేపు మాజీ సైనికుల సమావేశం

వైవీయూ : కడపలోని సీఎస్‌ఐ హైస్కూల్‌లో ఈనెల 12వ తేదీ ఆదివారం ఉదం 10 గంటలకు జిల్లా మాజీ సైనికుల సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పి. లక్ష్మీనారాయణ, బి.వి. గోపాల్ రెడ్డి తెలిపారు. సైనికుల పునరావాసం, మిలటరీ హాస్పిటల్, క్యాంటీన్, సైనిక కార్యాలయం, లైఫ్‌సర్టిఫికెట్ సమర్పణ, సర్వీస్ సంబంధిత అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు.

ఘనంగా సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాలు

పోస్టర్ ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి: రాయచోటిలో సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆల్ ఇండియా బంజారా సేవాసంఘం పేర్కొంది. ఈ మేరకు శుక్రవారం జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ చేతులు మీదుగా ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. అన్నమయ్య జిల్లా కేంద్రంలో కూడా ఈ ఉత్సవాలను మార్చి నెలలో నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అనంతపురం జిల్లా గుత్తిచెర్లోపల్లిలో వెలసిన సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ దేవాలయం వెలసిందని సంఘం సభ్యులు కలెక్టర్‌కు వివరించారు. అక్కడి ఆలయంలో ఈనెల 13,14,15వ తేదిలలో జయంతి ఉత్సవాలను జరుపుతారన్నారు. ఈ ఉత్సవాలకు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ ప్రాంతాల నుంచి బంజారాలు లక్షల మంది పాల్గొంటారన్నారు. బంజారా ఆచారాలతో, 108 మంది కన్య బంజారా మహిళా



ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న, జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, బంజారా సంఘం నాయకులు

మూర్తులతో పలు కార్యక్రమాలు జరుగుతాయన్నారు. పోస్టర్ ఆవిష్కరణలో ఆల్ ఇండియా బంజారా సేవాసంఘం రాష్ట్ర కోశాధికారి ఐ శివానాయక్, జిల్లా అధ్యక్షులు వెంకటస్వామి నాయక్, అర్జున్ నాయక్, శంకర్ నాయక్, విశ్వనాథ్ నాయక్, ధర్మానాయక్, బీడీ నాయక్, దాడి కృష్ణనాయక్, గోపి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఉపాధి కల్పనే ధ్యేయం





జాబ్‌మేళాలో ఉద్యోగార్హత సాధించిన వారికి ఆఫర్ లెటర్ అందిస్తున్న, ఎమ్మెల్యే నవాజ్‌బాషా, క్యూస్ కార్ప్‌లిమిటెడ్ ప్రతినిధులు- జాబ్‌మేళాకు హాజరైన నిరుద్యోగులు

- మదనపల్లెలో మెగాజాబ్‌మేళా విజయవంతం
- వేలాదిగా తరలివచ్చిన నిరుద్యోగ యువత
- 3,047 మందికి వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు
- రూ.20వేల నుంచి రూ.40 వేల వేతనంతో ఆఫర్‌లెటర్స్

మదనపల్లె: నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించి వారి కుటుంబాలకు అండగా నిలిచేందుకు ఎంపీ మిథున్‌రెడ్డి ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించినట్లు ఎమ్మెల్యే నవాజ్‌బాషా తెలిపారు. పట్టణంలోని బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళా విజయవంతమైంది. ఉదయం 8 గంటల నుంచే జాబ్ మేళాకు తరలివచ్చే విద్యార్థులతో పట్టణంలో సందడి నెలకొంది. జీవితంలో స్థిరపడేందుకు, ఉద్యోగావకాశాలను దక్కించుకుని తల్లిదండ్రులకు అండగా నిలవాలనే ఆశయంతో వచ్చిన యువత పట్టుదలతో జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకున్నారు. న్యూఢిల్లీకి చెందిన క్యూస్ కార్ప్ లిమిటెడ్, సన్నితి ఇనిషియేటివ్ సహకారంతో నిర్వహించిన మెగాజాబ్‌మేళాలో మదనపల్లె నియోజకవర్గం నుంచే కాకుండా పీలేరు, తంబళ్లపల్లె, పుంగనూరు, కదిరి నియోజకవర్గాల నుంచి పెద్దసంఖ్యలో నిరుద్యోగులు హాజరయ్యారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లమా పాలిటెక్నిక్, ఇంజనీరింగ్, బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీసీఏ విద్యార్హతలు కలిగిన నిరుద్యోగులు మొత్తం 9,257 మంది ఇంటర్వ్యూలకు హాజరుకాగా, అందులో 3,047 మంది వివిధ కంపెనీల్లో నెలకు రూ.20 వేల నుంచి రూ.40 వేల వేతనాలతో ఆఫర్ లెటర్స్ పొందారు. హైదరాబాదు, బెంగళూరు, తిరుపతి, న్యూఢిల్లీ వచ్చిన సుమారు 95 కంపెనీల ప్రతినిధులు జాబ్‌మేళాలో పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించారు. స్థానికంగా మదనపల్లె కేంద్రంగా పనిచేస్తున్న కొన్ని కంపెనీలు జాబ్‌మేళాలో పాల్గొని స్థానికంగా ఉన్న ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నవాజ్‌బాషా మీడియాతో మాట్లాడుతూ.. చదువుకొని ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగుల కోసం ఎంపీ మిథున్‌రెడ్డి జాబ్‌మేళా ఏర్పాటుచేశారన్నారు. ఊహించిన దానికంటే ఎక్కువమంది జాబ్‌మేళాకు హాజరై ఉద్యోగావకాశాలను పొందడం తమకెంతో సంతోషంగా ఉందన్నారు. ప్రతి పేద కుటుంబం ఆర్థికంగా ఎదగాలి, భవిష్యత్ తరాలకు మంచి జరగాలని ఆలోచించే వ్యక్తి సీఎం.జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఆయన నాయకత్వంలో తాను ఎమ్మెల్యేగా పనిచేస్తుండటం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఎంపీ మిథున్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో జాబ్‌మేళా ఏర్పాటుచేయడమే కాకుండా సొంత నిధులతో దూరప్రాంతాల నుంచి హాజరయ్యే నిరుద్యోగులకు రవాణా సౌకర్యం, జాబ్‌మేళాలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ భోజనవసతి కల్పించడం అభినందనీయమన్నారు. మదనపల్లె నియోజకవర్గంపై ఎంపీ మిథున్‌రెడ్డి ప్రత్యేక అభిమానానికి కృతజ్ఞతలు తెలిపారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించిన వివిధ కంపెనీల యాజమాన్యాలకు, హెచ్‌ఆర్ ప్రతినిధులకు కృతజ్ఞతాభివందనాలు తెలిపారు. జాబ్‌మేళాలో ఉద్యోగాలు పొందిన నిరుద్యోగులకు ఆఫర్‌లెటర్స్ అందజేశారు. కార్యక్రమంలో క్యూస్ కార్ప్ లిమిటెడ్ చీఫ్ ఆపరేషన్ ఆఫీసర్ జాకబ్‌మాథ్యూస్, జీఎం వెంకటేష్‌మూర్తి, సీనియర్ మేనేజర్ బినోద్‌కుమార్, హరిహరప్రసాద్, శంతన్, చైర్‌పర్సన్ మనూజారెడ్డి, వైస్‌చైర్మన్‌లు జింకాచలపతి, నూర్‌అజం, వార్డు కౌన్సిలర్లు, మార్కెట్‌కమిటీ డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి, సర్పంచ్ దండుకరుణాకర్‌రెడ్డి, శరత్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్.ఇర్ఫాన్‌ఖాన్, గుండ్లూరురఫీ, ఎల్‌ఐసీ.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రెండు ద్విచక్రవాహనాలు ఢీ..
– ఒకరి మృతి


మృతి చెందిన నరేష్

రామసముద్రం/మదనపల్లె : రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన శుక్రవారం సాయంత్రం రామసముద్రం మండలంలో జరిగింది. ఎలవానెల్లూరు పంచాయతీ దాసార్లపల్లెకు చెందిన వై.నరేష్(32) వ్యక్తిగత పనులపై ద్విచక్రవాహనంలో రామసముద్రం వెళుతుండగా.. మార్గంమధ్యలో ఎదురుగా వచ్చిన మరో ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో నరేష్ తీవ్రంగా గాయపడటంతో కుటుంబ సభ్యులు మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే నరేష్ మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు. రామసముద్రం పోలీసులు కేసు నమోదు చేసి విచారణ సాగిస్తున్నారు.

బస్సును ఓవర్‌టేక్ చేయబోయి..
– ట్రాక్టర్ కిందికి దూసుకెళ్లిన బైక్
– యువకుడికి తీవ్ర గాయాలు


తీవ్రంగా గాయపడిన శ్రీనాథరాజు


ట్రాక్టర్ కిందికి దూసుకెళ్లిన ద్విచక్రవాహనం

మదనపల్లె : బస్సును ఓవర్‌టేక్ చేయబోయిన ద్విచక్రవాహనం ట్రాక్టర్ కిందికి దూసుకెళ్లడంతో.. ఓ యువకుడు తీవ్ర గాయాల పాలయ్యాడు. వైఎస్సార్ జిల్లాలోని కడప నగరం విజయనగర్‌కు చెందిన శ్రీనాథరాజు(32) వ్యక్తిగత పనులపై మదనపల్లెకు వచ్చి ద్విచక్ర వాహనంలో తిరుగు ప్రయాణమయ్యాడు. అమ్మచెరువు మిట్ట వద్ద ముందు వెళుతున్న బస్సును ఓవర్‌టేక్ చేసే ప్రయత్నంలో అదుపు తప్పి రోడ్డుకు అటు వైపుగా నిలిపిన ట్రాక్టర్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితికి వెళ్లాడు. గమనించిన స్థానికులు మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు.

త్వరలో హార్సిలీహిల్స్‌పై టూరిస్ట్ పోలీసు ప్రారంభం

- విధుల్లో ఆరుగురు పోలీసులు
- పోలీసు క్వార్టర్స్‌ను పరిశీలించిన ఎస్పీ హర్షవర్ధన్‌రాజు


హార్సిలీహిల్స్‌పై పర్యటిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, డీఎస్పీ, సీఐ, ఎస్‌ఐలు

బి.కొత్తకోట : బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై టూరిస్ట్ పోలీస్ (ఔట్‌పోస్టు)ను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ పద్ధతిలో త్వరలో ప్రారంభించనున్నారని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు. శుక్రవారం హార్సిలీహిల్స్ వచ్చిన ఆయన ప్రారంభానికి సిద్ధంగా ఉన్న టూరిస్ట్ పోలీస్ భవనాన్ని పరిశీలించారు. బ్రిటీష్ హయాంలో నిర్మించిన పోలీసు ఔట్‌పోస్టు భవనం వినియోగంలో లేదు, దీన్ని ఆధునీకరించి ప్రారంభానికి సిద్ధం చేశారు. ఈ ఏర్పాట్లను, కేంద్రంలోని అన్ని గదులు, వాటిలో సౌకర్యాలను పరిశీలించారు. ఔట్‌పోస్టులో ఆరుగురు పోలీసులు విధుల్లో ఉంటారని, వీరు పర్యాటకుల భద్రతకు ప్రాధాన్యం ఇస్తారన్నారు. సందర్శకులు పర్యటించేందుకు ఇబ్బంది పడకుండా సలహాలు, సూచనలు చేస్తారని చెప్పారు. ఈ భవనానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకొన్నారు. తర్వాత పోలీసు అధికారులతో కొండపై నెలకొన్న పరిస్థితులను సమీక్షించారు. టూరిస్ట్ పోలీసు కేంద్రానికి టూరిజం అవుట్‌సోర్సింగ్ సిబ్బందిని కేటాయించాలని మేనేజర్ నేదురుమల్లి సాల్వీన్‌రెడ్డిని కోరగా.. తమకు సిబ్బంది కొరత ఉందని చెప్పారు. అనంతరం ప్రకృతి అధ్యయన కేంద్రం సమీపంలో బ్రిటిష్ పాలనలో పోలీసులకు నిర్మించిన క్వార్టర్స్‌ను ఎస్పీ పరిశీలించారు. వీటిలో పర్యాటక శాఖ సిబ్బంది నివాసం ఉంటున్నారని ఎస్పీ దృష్టికి తెచ్చారు. కొండపైకి వస్తున్న సందర్శకుల రద్దీ, ఇబ్బందులపై ఆరా తీశారు. పర్యాటకుల భద్రత ప్రభుత్వ ప్రాధాన్య అంశమని, దీన్ని పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు.

సారా, స్మగ్లింగ్‌కు దూరంగా ఉండేలా మార్పు

అనంతరం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు మీడియాతో మాట్లాడారు. జిల్లాలో నాటుసారా తయారీ–విక్రయాలు, ఎర్ర చందనం స్మగ్లింగ్–వృక్షాల నరికివేత కూలీల జీవితాల్లో మార్పు తీసుకొచ్చి వాటికి దూరంగా ఉండేలా చేసేందుకు చేపట్టిన చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయని అన్నారు. ప్రత్యామ్నాయంగా వీరికి రుణాల మంజూరు, పథకాలు అమలు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. జీవనోపాధి కల్పించడం కోసం కలెక్టర్‌ను కలిసి విన్నవించడం జరిగిందని పేర్కొన్నారు. ఆయన వెంట ఇన్‌చార్జి డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ శివాంజనేయులు, ఎస్‌ఐలు రామమోహన్, సుకుమార్ ఉన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఆరుగురికి గాయాలు


గాయపడ్డ జయరామ్

మదనపల్లె : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురు వ్యక్తులు గాయపడ్డారు. పట్టణంలోని బసినికొండకు చెందిన అరవింద్(24), అమ్మచెరువుమిట్టకు చెందిన అంబిక(25), చింతపర్తికి చెందిన వెంకటరమణ(35) రాయచోటిలో జరిగిన వివాహానికి ఆర్కెస్ట్రాలో భాగంగా గురువారం వెళ్లారు. శుక్రవారం కార్యక్రమం ముగించుకుని ఆటోలో తిరుగు ప్రయాణమయ్యారు. మార్గంమధ్యలో కురబలకోట మండలం రామిగానిపల్లె వద్ద వస్తుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న వారు ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు 108 అంబులెన్స్‌లో మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గుర్రంకొండ మండలం తరిగొండకు చెందిన మోజెస్, ఆయన భార్య సుప్రియ(40) శుక్రవారం వ్యక్తిగత పనులపై గుర్రంకొండకు వెళ్లి తిరిగి తరిగొండకు బయలుదేరారు. గ్రామ సమీపంలో ద్విచక్రవాహనానికి అడ్డుగా పశువులు రావడంతో బైక్ నడుపుతున్న మోజెస్ సడెన్‌బ్రేక్ వేశారు. వెనుక కూర్చున్న సుప్రియ జారి కిందపడింది. ఆమె తలకు బలమైన గాయాలు కావడంతో స్థానికుల సహాయంతో మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్సకై తిరుపతికి తరలించారు. పెద్దమండ్యం మండలం కలిచెర్ల పంచాయతీ కోటకాడపల్లెకు చెందిన జయరామ్(50), వెంకటరమణ(45) రైతులు. వీరు శుక్రవారం ఆవుల కొనుగోలు నిమిత్తం గుర్రంకొండకు వచ్చి తిరిగి కలిచెర్లకు ద్విచక్ర వాహనంలో వెళుతుండగా, సంగసముద్రం పంచాయతీ మామిళ్లవారిపల్లె వద్ద వాహనం అదుపుతప్పి కిందపడ్డారు. ప్రమాదంలో జయరామ్ తీవ్రంగా గాయపడగా, వెంకటరమణ సైతం గాయపడ్డాడు. బాధితులను స్థానికులు 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, జయరామ్ పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతికి తరలించారు.

ఆవును ఢీకొన్న బైక్
– ముగ్గురికి గాయాలు

చిన్నమండెం : మండలంలోని కడప– బెంగళూరు జాతీయ రహదారిపై చిన్నమండెం విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద శుక్రవారం ఆవును బైక్ ఢీకొనడంతో ముగ్గురు గాయపడ్డారు. కొండ, చిన్న, శ్రీను ద్విచక్ర వాహనంలో వెళ్తూ దేవుని ఆవును ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో వారు ముగ్గురూ గాయపడ్డారు. బాధితులను 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బోరువైర్లు చోరీపై ఫిర్యాదు

సంబేపల్లె : మండల పరిధి పీఎన్ కాలనీ పంచాయతీలోని చెంచురెడ్డిగారిపల్లెకు చెందిన రైతులు తమ బోరు వైర్లు చోరీ జరగాయని శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. చెంచురెడ్డిగారిపల్లెకు చెందిన రైతులు సహదేవరెడ్డి, బాబురెడ్డి, సబ్బారెడ్డి, క్రిష్టారెడ్డి తమకు సంబంధించిన దాదాపు 60 మీటర్ల బోరు వైర్లు గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

145.450 గ్రాముల బంగారు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీధర్

వాల్మీకిపురం : చోరీ కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి బంగారంను రికవరీ చేసినట్లు రాయచోటి డీఎస్పీ శ్రీధర్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని మూరేవాండ్లపల్లి పంచాయతీ పెద్దవంకపల్లి గ్రామానికి చెందిన ఈశ్వరయ్య తల్లి పద్మావతమ్మ ఇంటికి తాళాలు వేసుకొని పొలం పనులకు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో కలకడ మండలం ముడియంవారిపల్లికి చెందిన చింతపర్తి వెంకటరమణరెడ్డి ఇంట్లోకి చొరబడి బీరువాలోని సుమారు 145 గ్రాముల బంగారంను దొంగలించుకొని పోయారు. ఈ మేరకు వాల్మీకిపురం పోలీసులు జనవరి 20వ తేదీన కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ నెల 9న కలికిరి టౌన్ సత్యారెడ్డి వీధిలో నిందితుడు ఉండడంతో సీఐ బీఎస్ సురేష్ సిబ్బందితో కలిసి వెళ్లి అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి 145.450 గ్రాముల బంగారం, వీటి విలువ రూ.6,54,525 రికవరీ చేసినట్లు సీఐ తెలిపారు. ఈ కేసును త్వరితగతిన ఛేదించిన సీఐ బీఎస్ సురేష్, ఎస్సై బిందుమాధవి, కలికిరి ఏఎస్‌ఐ మధుసూదనాచారి, సిబ్బందిని ఎస్పీ, డీఎస్పీ అభినందించారు.

అప్పుడే నూరేళ్లు నిండాయా..!

- డ్రైనేజీలో పడి బాలుడి మృతి
- కన్నీరుమున్నీరుగా విలపించిన బాధిత కుటుంబం


బాలుడి మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబీకులు, బంధువులు

సిద్దవటం : 'అప్పుడే నూరేళ్లు నిండాయా కన్నా'.. అంటూ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదించారు. అల్లారుముద్దుగా పెంచుకున్న తమ కుమారుడు మృత్యువాత పడటంతో వారు కన్నీరుమున్నీరయ్యారు. సిద్దవటం మండలంలోని నేకనాపురం గ్రామంలో శుక్రవారం సాయంత్రం డ్రైనేజీ కాలువలో పడి ఓ బాలుడు మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. నేకనాపురం గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన గంపల సునీత, హరీష్‌లకు కొడుకు, కూతురు ఉన్నారు. వీరిలో కొడుకు అభిరామ్(4) పెద్దవాడు. శుక్రవారం సాయంత్రం పిల్లలతో కలిసి ఆడుకుంటూ ఉండగా గ్రామ సమీపంలోని డ్రైనేజీ కాలువలో ప్రమాదవశాత్తు పడ్డాడు. ఈ విషయాన్ని తోటి పిల్లలు ఇంట్లో చెప్పడంతో వారు వచ్చి బయటకు తీశారు. అప్పటికే మృతి చెందాడు. దీంతో కుటుంబీకులు, బంధువులు కన్నీటి పర్యంతమై బోరున విలపించారు.

కడప ఆకాశవాణిని క్లస్టర్‌గా చేయాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రజాసంఘాల నాయకులు


మాట్లాడుతున్న సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : ఆకాశవాణి కడప కేంద్రాన్ని విజయవాడకు తరలించవద్దని ప్రజాసంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. ప్రొద్దుటూరులోని జనవిజ్ఞాన వేదిక కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. రాయలసీమ కడప ఆకాశవాణిని ఒక క్లస్టర్‌గా చేయాలని వారు డిమాండ్ చేశారు. కడప రేడియో స్టేషన్‌ను నిలబెట్టుకునే బాధ్యత సీమవాసులందరిదని వారంతా ముక్తకంఠంతో అన్నారు. అందరూ కలసి ఒక కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకుంటున్నామని సమావేశకర్తలైన ఖలందర్, సృజన శ్రీను అన్నారు. సీపీఐ ముందు వరుసలో నిలిచి పోరాడుతుందని సుబ్బరాయుడు తెలిపారు. మనకెందుకులే అని ఊరుకుంటే మనం రాయలసీమలో ఏమి మిగలబెట్టుకోలేమని, పోరాడి రేడియో స్టేషన్‌ను నిలబెట్టే ప్రయత్నం చేయాలని విరసం వరలక్ష్మి అన్నారు. అధ్యక్షుడు కుతుబుద్దీన్ మాట్లాడుతూ రాయలసీమ సాంస్కృతిక వేదికలైన రేడియో స్టేషన్‌ను తరలించకుండా తమవంతు కృషి చేస్తామని తెలిపారు. సమావేశంలో సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి మాట్లాడుతూ ఈ విషయమై తాను ఇదివరకే ఎంపీల దృష్టికి తీసుకెళ్లానన్నారు. అందరం జిల్లాలోని ఎమ్మెల్యేలను కలిసి వినతి పత్రాలను అందచేయాలన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యేల ద్వారా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తే సమస్య పరిష్కారం అవుతుందని తెలిపారు. సమావేశంలో పల్లవోలు రమణ, జేవీవీ సునీత, నాగేష్, రామేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విధుల్లోనే గుండెపోటుతో వెలుగు సీసీ మృతి


చంద్రమోహన్(ఫైల్)

ఒంటిమిట్ట : ఒంటిమిట్టలోని వెలుగు కార్యాలయంలో సీసీ మిద్దె చంద్రమోహన్(42) శుక్రవారం మధ్యాహ్నం విధులు నిర్వహిస్తుండగానే గుండెపోటు రావడంతో మృతి చెందాడు. సహ ఉద్యోగుల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. టేబుల్ వద్ద కుర్చీలో కూర్చుని విధులు నిర్వహిస్తున్న సాలాబాద్ క్లస్టర్ సీసీ మిద్దె చంద్రమోహన్‌కు గుండెపోటు రావడంతో.. కుర్చీలోనే విగత జీవిగా ఉండటం చూసిన సహ ఉద్యోగులు వెంటనే స్థానిక పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. ఆయనకు డాక్టర్లు వైద్య పరీక్షలు చేసి, అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. ఆయన భార్య వీణావాని అక్కడికి చేరుకుని బోరున విలపించింది. చంద్రమోహన్ సొంత ఊరు వీరపునాయునిపల్లి మండలం ఎస్.పాలగిరి గ్రామం. ఆయనకు భార్య వీణా వాని, కూతురు వీణా అక్షర(10), కొడుకు వీణా అజయ్(6) ఉన్నారు.

పాముకాటుతో మహిళకు తీవ్ర అస్వస్థత

మదనపల్లె : పాము కాటుకు గురై ఓ మహిళ తీవ్ర అస్వస్థతకు గురైన సంఘటన మండలంలోని కోళ్లబైలు పంచాయతీలో శుక్రవారం జరిగింది. ఎగువ మిట్టామర్రి గ్రామానికి చెందిన గోపాల్‌రెడ్డి భార్య జమునమ్మ(45) పొలం వద్దకు వెళ్లి వ్యవసాయ పనులు చేస్తుండగా పాము కాటేసింది. దీంతో ఆమె తీవ్ర అస్వస్థతకు గురైంది. గమనించిన కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌లో మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : కుటుంబ సమస్యలతో వివాహిత ఆత్మహత్యకు ప్రయత్నించిన సంఘటన శుక్రవారం పీటీఎం మండలంలో జరిగింది. ముంతగోగులపల్లెకు చెందిన మంజునాథ్ భార్య పవిత్ర (26) కుటుంబ సమస్యలతో శుక్రవారం తెల్లవారుజామున క్రిమి సంహారణ మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు బి.కొత్తకోట కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌కు తరలించారు. ప్రాథమిక చికిత్సల అనంతరం మెరుగైన చికిత్సల కోసం మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

చెట్టును ఢీకొని కాలువలో పడ్డ లారీ

సిద్దవటం : మండలంలోని భాకరాపేట గ్రామ శివారులో లారీ శుక్రవారం తెల్లవారు జామున చెట్టును ఢీకొని పక్కనే ఉన్న మురుగు నీటి కాల్వలో పడింది. కర్ణాటకకు చెందిన లారీ చెన్నై నుంచి పాత ఇనుప సామాను లోడుతో బళ్లారి వెళ్తోంది. మార్గంమధ్యలో లారీ అదుపు తప్పి చెట్టును ఢీకొనడంతో పక్కనే ఉన్న మురుగు నీటి కాలువలో పడింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. లారీ ముందు భాగం కొంత దెబ్బతినింది.

రూ.40 లక్షల సెల్‌ఫోన్‌ల రికవరీ

- 131 మంది బాధితులకు అప్పగింత
- సత్ఫలితాలిస్తున్న ఎంఎంటీఎస్
- ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

కడప అర్బన్ : జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన మిస్సింగ్ మొబైల్ ట్రాకింగ్ సిస్టం (ఎంఎంటీఎస్) ప్రారంభించిన అతి తక్కువ సమయంలోనే సత్ఫలితాలు ఇస్తోంది. ఈ పద్ధతి ద్వారా దాదాపు రూ.40 లక్షల విలువైన 131 మొబైల్స్‌ను రికవరీ చేసి జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ చేతుల మీదుగా శుక్రవారం బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా కడపలోని పోలీసు కార్యాలయం వద్ద వున్న 'పెన్నార్' పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎస్పీ సెల్‌ఫోన్‌ల మిస్సింగ్, ఫిర్యాదులు, రికవరీల గురించి వివరించారు. ఫోన్‌లు పోగొట్టుకున్న వారికి పోలీస్ స్టేషన్‌కు వెళ్లకుండా, ఎఫ్ఐఆర్ నమోదు లేకుండా తిరిగి అందజేయాలనే సంకల్పంతో.. గతేడాది డిసెంబర్ 1న మిస్సింగ్ మొబైల్ ట్రాకింగ్ సిస్టం అనే ఉచిత వెబ్‌సైట్ సేవలు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ విధానంలో ప్రజలకు మరింత సులువుగా చాట్ బాక్స్ ద్వారా (వాట్సాప్ నంబర్ 93929 41541) సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటి వరకూ 2300 మొబైల్స్ మిస్సింగ్ ఫిర్యాదులు అందగా.. 510 యాక్టివ్ మొబైల్స్‌ను గుర్తించినట్లు చెప్పారు. మిగిలిన మొబైల్స్‌ను కూడా రికవరీ చేసి బాధితులకు అందిస్తామని తెలియజేశారు. రెండు దఫాలుగా మొత్తం రూ.70 లక్షల విలువైన 261 సెల్‌ఫోన్‌లను రికవరీ చేసి అందజేసినట్లు వివరించారు. సరైన బిల్లులు లేకుండా ఎవరూ మొబైల్ ఫోన్‌లను కొనుగోలు చేయవద్దని సూచించారు. అనంతరం జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్‌కు 'థ్యాంక్యూ ఎస్పీ సార్' అంటూ బాధితులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) తుషార్ డూడీ, ఫ్యాక్షన్ జోన్ డీఎస్పీ చెంచుబాబు పాల్గొన్నారు. మొబైల్ ఫోన్‌ల రికవరీలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) ఆధ్వర్యంలో ఏర్పాటైన ఫ్యాక్షన్ జోన్ డీఎస్పీ చెంచుబాబు, సైబర్ క్రైమ్ టెక్నికల్ విభాగం ఇన్‌స్పెక్టర్ వి.శ్రీధర్ నాయుడు, ఎస్‌ఐలు మధుమల్లేశ్వర్‌రెడ్డి, రవికుమార్, ఆర్ఎస్ఐ శ్రీనివాసులు బృందాన్ని ఎస్పీ అభినందించి, ప్రశంసా పత్రాలను అందజేశారు.

మరో ఇద్దరు అంతర్‌రాష్ట్ర సైబర్ నేరగాళ్ల అరెస్ట్

- ఆధార్ ఆధారిత సమాచారం దుర్వినియోగంతో డబ్బులు కాజేసిన వైనం
- ఇటీవలే ప్రధాన నిందితుడి అరెస్ట్
- జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

కడప అర్బన్ : మరో ఇద్దరు అంతర్‌రాష్ట్ర సైబర్ నేరగాళ్లను జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. ఉత్తర ప్రదేశ్ నుంచి వారిని కడపకు తీసుకొచ్చి జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం మీడియా ఎదుట హాజరు పరిచారు. ఇటీవలి కాలంలో జిల్లాలోని కొంత మంది ప్రజలు తమ బ్యాంక్ అకౌంట్ నుంచి తమకు తెలియకుండా నగదు బదిలీ అవుతోందని ఫిర్యాదు చేశారు. కడప నగరంలోని చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పక్కీరుపల్లికి చెందిన సానపు రాజశేఖర్‌రెడ్డి గతేడాది జూన్ 21 నుంచి 29 వరకు కెనరా, యూనియన్ బ్యాంక్‌ల అకౌంట్‌ల నుంచి తనకు తెలియకుండా రూ.89.550లను వేరే బ్యాంక్ ఖాతాలకు నగదును ఎవరో బదిలీ చేసుకున్నట్లు ఫిర్యాదు చేశారు. తాను ఎవరికీ ఓటీపీలు చెప్పడం గానీ, ఎలాంటి లింక్‌లు గానీ ఓపెన్ చేయలేదని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు చిన్నచౌక్ పోలీసులు కేసు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) తుషార్ డూడీ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని నియమించి విచారణ చేపట్టారు. నేరస్తులు ఆధార్ ఎనేబుల్ సిస్టం (ఏఈపీఎస్) ద్వారా ఫిర్యాది బయోమెట్రిక్ (వేలిముద్ర)లు నకిలీవి సృష్టించి, వాటి సాయంతో (బ్యాంక్ బిజినెస్ కరస్పాండెంట్స్ ఏజెంట్స్) కస్టమర్ సర్వీస్ పాయింట్‌లలోని బయోమెట్రిక్ డివైజ్ స్కానర్స్‌లో స్కాన్ చేశారు. ఆధార్ కార్డుకు లింక్ వున్న బ్యాంక్ అకౌంట్‌ల నుంచి రోజుకు రూ.10వేలు చొప్పున మొత్తం రూ. 89,550 విత్‌డ్రా చేసినట్లు పోలీసులు గుర్తించారు.

సాంకేతిక నైపుణ్యం ఆధారంగా ఛేదన

సాంకేతిక నైపుణ్యం ఆధారంగా విత్‌డ్రా జరిగిన ప్రాంతాన్ని పోలీసులు తెలుసుకున్నారు. బ్యాంక్ బిజినెస్ ఏజెంట్ల నుంచి సమాచారం సేకరించారు. నేరం చేసేటపుడు సైబర్‌నేరగాళ్లు వదిలిన డిజిటల్ ఫుట్ ప్రింట్స్ ఆధారంగా వారి పూర్తి వివరాలను తెలుసుకున్నారు. సైబర్ నేరగాళ్లు ఈ తరహా ఏఈపీఎస్ స్కాంలను ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలోని గోరక్‌పూర్ జిల్లాలోని ఖజని ప్రాంతంలో ఆపరేట్ చేస్తున్నారని కనుక్కున్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ప్రత్యేక బృందం ఉత్తర ప్రదేశ్‌కు చేరుకుని సైబర్ నేరగాళ్ల సమాచార విశ్లేషణ ఆధారంగా ట్రాక్ చేసి కనుగొన్నారు. ఇందులో మొదటగా జనవరి 22న శేషనాథ్ విశ్వకర్మను అరెస్ట్ చేసి విచారణ చేశారు. ఆయన స్నేహితులైన వికాస్ అలియాస్ విక్కి, అక్షయ్‌యాదవ్‌తో కలిసి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో అకౌంట్‌లను ఓపెన్ చేసి, తన పేరుతో కస్టమర్ సర్వీస్ పాయింట్, జనసేవాకేంద్రం పర్మిషన్ పొందారు. ఆ షాప్ ద్వారా స్పైస్ మనీ, పే నియర్‌బై మర్చంట్‌లతో ఒప్పందం ద్వారా డెబిట్‌కార్డు లేకుండా ఆధార్ కార్డు నంబరు, బయోమెట్రిక్ (వేలిముద్రలు) సాయంతో చిన్నమొత్తాలలో నగదు విత్‌డ్రా చేసే ఏఈపీఎస్ బయోమెట్రిక్ డివైస్‌ను పొందారు. ఈ ఏఈపీఎస్ ద్వారా తన స్నేహితులు వికాస్ అలియాస్ విక్కీ, అక్షయ్‌యాదవ్‌లు ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యక్తుల ఆధార్ సమాచారాన్ని దొంగచాటుగా సేకరించారు. వాటి ద్వారా నకిలీ వేలిముద్రలను తయారు చేసి ప్రజల బ్యాంక్ ఖాతాల నుంచి తమ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఖాతాలకు నగదును బదిలీ చేసేవారు. ఈ విధంగా ఇప్పటికే 440 మంది నకిలీ ముద్రలను తయారు చేసి వారి బ్యాంక్ ఖాతాల నుంచి డబ్బులను కాజేశారని గుర్తించారు. ఇప్పటికే ప్రధాన నిందితుడు శేషనాథ్ విశ్వకర్మను ఇటీవలే అరెస్ట్ చేశారు. అతన్ని విచారించిన ఆధారంగా ఉత్తరప్రదేశ్ రాష్ట్రం గోరక్‌పూర్ జిల్లా జైలులో వున్న వికాస్, అక్షయ్‌యాదవ్‌లను పి.టి వారెంట్ ద్వారా ఈనెల 6న జుడిషియల్ కస్టడీకి అప్పగించారు. ఇంకా ఈ ఏఈపీఎస్ స్కాంలో పాల్గొన్న గోరఖ్ పూర్‌కు చెందిన పాండే వున్నారని, అతని కోసం ప్రత్యేక టీమ్ నియమించామన్నారు. ప్రజలందరూ తమ ఆధార్ కార్డ్‌లను యుఐడిఏఐ.జిఓవి.ఇన్ వెబ్‌సైట్‌లో లాగిన్ అయ్యి తమ బయోమెట్రిక్‌లను ఓటీపీలతో అనుసంధానం చేసుకుని భద్రపరచుకోవాలని ఎస్పీ సూచించారు. ఇలాంటి మోసాలకు గురైన బాధితులెవరైనా వుంటే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్పీ సూచించారు. నిందితులను అరెస్ట్ చేయడంలో కృషి చేసిన చిన్నచౌక్ సీఐ శ్రీరామ్ శ్రీనివాసులు, సైబర్ క్రైమ్ సెల్ సీఐ శ్రీధర్‌నాయుడు, చిన్నచౌక్ ఎస్ఐ అమర్‌నాథ్‌రెడ్డి, సైబర్ క్రైమ్ సెల్ ఎస్‌ఐలు మధుమల్లేశ్వర్‌రెడ్డి, రవికుమార్, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.